క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ వార్షికోత్సవం


కొరుప్రోలులోని అభయాంజనేయ స్వామి

ఎస్.రాయవరం: కొరుప్రోలు కుమ్మరవీధిలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్స వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామునుంచి స్వామి సింధూర, తమలపాకు పూజలు నిర్వహించారు. గ్రామంలో ఏకైక దేవాలయం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు.మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

రేపు కోదండ సీతారాముల వార్షికోత్సవం


గవర్ల అనకాపల్లిలో సీతారాములు

మునగపాక : గవర్ల అనకాపల్లిలో ఈ నెల 13న శ్రీ కోదండ సీతారాముల 20వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ చైర్మన్ పాలమరశెట్టి అప్పలరాజు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11గంటల నుంచి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీతారాముల దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి తీర్థం స్వీకరించాలని అప్పలరాజు కోరారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి: మండలంలో ఉపమాకలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. భజనలు, ఏకాహం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. నక్కపల్లి, ఉపమాక, సారిపల్లిపాలెం, మనబానపాలెం, అయ్యన్నపాలెం తదితర గ్రామాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కానుకలు మొక్కుబడులు సమర్పించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు.

దీన్‌దయాల్ ఉపాధ్యాయకు నివాళులు


దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : నాగులాపల్లిలో శనివారం దీన్‌దయాల్ ఉపాధ్యాయ పుణ్యతిథి కార్యక్రమం జరిగింది. ముందుగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మళ్ల కాశేశ్వరరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేటి ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో దొడ్డి రాము, శెట్టి బలిజ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ పైపులైన్ పనులపై ఆందోళన

అచ్యుతాపురం(అనకాపల్లి): పూడిమడక వద్ద బ్రాండిక్స్ నిర్మిస్తున్న రెండో పైపులైన్‌ను నిలిపివేయాలని పూడిమడకకు చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం అఖిలపక్షం నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. పూడిమడక జగన్నాథస్వామి ఆలయం వద్ద నిర్వహించే అఖిలపక్ష సమావేశంలో పెండింగ్ ప్యాకేజీలతో పాటు, రెండవ పైపులైన్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రణాళికలు రూపొందిస్తామని పలువురు మత్స్యకారులు తెలిపారు.

ఘనంగా రాజరాజేశ్వర స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట

- కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు
- భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలు


ధ్వజ స్తంభం పూజల్లో పాల్గొన్న మళ్ల ప్రకాష్ శివాజీ, సరిత దంపతులు


ధ్వజస్తంభం స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ట శనివారం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన మళ్ల మహర ప్రకాష్ శివాజీ, సరిత దంపతులతో ఏకశిలా ధ్వజ స్తంభం ప్రతిష్ట జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, స్థానిక కౌన్సిలర్ కర్రి లక్ష్మి ముఖ్య అతిథులుగా విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ ధ్వజస్తంభం ప్రతిష్టకు చుట్టు పక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని ప్రసాదాలు స్వీకరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివ, కౌన్సిలర్ హరినాథ్, మళ్ల వారి కుటుంబ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవింద్ అయ్యలు నాయుడు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిపై గ్రామసభ వాయిదా


గ్రామసభ నిర్వహణ కోసం వచ్చిన ఆర్‌డీవో జయరామ్

నక్కపల్లి : మండలంలో నల్లమట్టిపాలెంలో సర్వే నంబర్ 151/2 వివాదాస్పద భూమికి సంబంధించి శనివారం జరగాల్సిన గ్రామసభ వాయిదా పడింది. ఈ సర్వే నంబరులో 8.33 ఎకరాల భూమి 22ఏ రిజిస్టర్‌లో నమోదయింది. ఈ భూమి జిరాయితీ అని తమకు చెందిందంటూ ఈ సర్వే నంబరును 22 ఏ రిజిస్టర్ నుంచి తొలగించాలంటూ భూమి యజమానులుగా చెప్పుకుంటున్న వరహా ఆక్వా యాజమాన్యం ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. దీనిపై నర్సీపట్నం ఆర్‌డీవో జయరామ్ ఆధ్వర్యంలో గ్రామంలో గ్రామసభ నిర్వహించి పంచాయతీ పెద్దలు, గ్రామానికి చెందిన రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని నిర్ణయించారు. వాస్తవంగా ఈ భూమి రెవెన్యూ రికార్డుల్లో పచ్చిక బయళ్లుగా నమోదయిందని, పూర్వీకుల నుంచి తమ గ్రామస్తులు పశువులను మేపుకొనే వారమని, ఈ భూమి ప్రభుత్వానిదేనంటూ కొంతమంది గ్రామస్తులు చెబుతున్నారు. వరహా ఆక్వా వారు తమ వద్ద రికార్డులు ఉన్నాయంటూ ఈ భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ వివాదాస్పద భూమిపై అభ్యంతరాలు స్వీకరించి ప్రభుత్వానికి నివేదిక పంపించేందుకు గ్రామసభ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో స్థానిక రెవెన్యూ సిబ్బంది గ్రామసభ ఏర్పాటు చేయగా గ్రామస్తులు ఈ భూమి గురించి తమ పూర్వీకులను అడిగి చెబుతామని మూడు రోజుల సమయం కావాలని ఆర్‌డీవోను కోరారు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామ సభను వాయిదా వేస్తున్నామని మరోసారి నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. దీనిపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ నీరజ మాట్లాడుతూ ఈ సర్వే నంబరు 22 ఏలో నమోదైందని, దానిని తొలగించాలని భూ యజమానులు 2017లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు గ్రామసభ ఏర్పాటు చేయగా, గ్రామస్తులు గడువు కోరడంతో వాయిదా వేశామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా కన్వీనర్ల నియామకం

నక్కపల్లి : వైఎస్సార్‌సీపీలో మరింత చురుగ్గా పనిచేసేందుకు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ సోషల్ మీడియాలో దూసుకుపోయేందుకు వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా విభాగం తరఫున కన్వీనర్ల నియామకం చేపట్టింది. పాయకరావుపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో నలుగురు కన్వీనర్లతో పాటు, మరో 16 మంది కో కన్వీనర్లను నియమించారు. పాయకరావుపేటకు చెందిన కొంకిపూడి రామకృష్ణ ఇప్పటికే నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజా మండలాల వారీగా కన్వీనర్లను, కో కన్వీనర్లను నియమించారు. పాయకరావుపేట సోషల్‌మీడియా మండల కన్వీనర్‌గా డొక్కుమళ్ల నానాజీ, కో కన్వీనర్లుగా అనిశెట్టి వెంకటసూరి, రావాడ బాబ్జి, వద్దిపర్తి ఖుషిరాజు, దేవవరపు శివగణేష్‌లను నక్కపల్లి మండల కన్వీనర్‌గా చొప్పా శ్రీను, కో కన్వీనర్లుగా బొంది గోవిందు, ఆరుగుల దేముడు, పల్లా దారబాబు, మేకల సురేష్‌లను, ఎస్.రాయవరం మండల కన్వీనర్‌గా కర్రీ గణేష్, కో కన్వీనర్లుగా నానేపల్లి అప్పలరాజు, చోడిపల్లి వాసు, బాదనపల్లి వీర్రాజు, పోలినాటి బాబి, కోటవురట్ల మండల కన్వీనర్‌గా కొల్లి గోపాల కృష్ణ, కో కన్వీనర్లుగా గణశాల శ్రీనివాస్, శానాపతి ప్రసాద్,చిందాడ వెంకటరమణ, పెన్నాడ అప్పలరాజులను నియమించారు.

నేటి నుంచి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు


పోటీలకు సిద్ధమవుతున్న క్రీడామైదానం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని నునపర్తిలో ఈ నెల 12 నుంచి ఉత్తరాంధ్ర స్థాయి వన్ సీనియర్ ఆహ్వానపు స్త్రీ, పురుషుల విభాగంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి అయ్యాయని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు తెలిపారు. నునపర్తి శ్రీ నల్లమారమ్మ పండగను పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహించనున్నారు. పురుషుల విభాగంలో శ్రీకాకుళం, విజయనగరం, స్టీల్‌ప్లాంట్, ఆంధ్ర యూనివర్సిటీ, నునపర్తి, రైల్వే జట్టు, బీహెచ్‌పీవీ, టి.అర్జాపురం, వాడచీపురుపల్లి, యలమంచిలి, నడుపూరు, నెల్లిముక్కు, స్త్రీల విభాగంలో విజయనగరం, శ్రీకాకుళం, వాడచీపురుపల్లి, నునపర్తి జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రమాదవశాత్తూ లారీ బోల్తా


యలమంచిలి పురుషోత్తపురం సమీపంలో బోల్తాపడిన లారీ


రోడ్డు పక్కన బోల్తాపడిన లారీ

యలమంచిలి : యలమంచిలి మండలం పురుషోత్తపురం సమీపంలో శనివారం లారీ అదుపు తప్పి బోల్తా పడింది. రూరల్ ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాలు ప్రకారం తుని నుంచి విశాఖపట్నం వెళుతున్న లారీ యలమంచిలి మండలం పురుషోత్తపురం హైవే సమీపంలో రోడ్డు పక్కన కాలువలో అదుపు తప్పి పడిపోయిందని ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయని ఎస్‌ఐ తెలిపారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. ఈ ఘటనలో లారీ దెబ్బతినగా, పెద్ద ప్రమాదం తప్పిందని అతి వేగమే ప్రమాదానికి కారణమని ఎస్‌ఐ పేర్కొన్నారు.

డ్రైవర్‌కు గాయాలు

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై లారీ బోల్తా పడి డ్రైవర్‌కి స్వల్ప గాయాలయ్యాయి. యలమంచిలి నుంచి తుని వైపు వెళ్లే లారీ అడ్డురోడ్డు సమీపంలో పెద్ద మదుం వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా తప్పించుకోవడంతో స్వల్పగాయాలతో బయట పడ్డాడు. ఎస్.రాయవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

ముమ్మరంగా రబీ వరినాట్లు


విజయరామరాజుపేటలో వేసిన రబీ వరి నాట్లు

బుచ్చెయ్యపేట: మండలంలో రబీ వరినాట్లు జోరందుకున్నాయి. ప్రధానంగా వడ్దాది, విజయరామరాజుపేట, గంటికొర్లాం, మంగళాపురం, కుముదాంపేట, కందిపూడి, బుచ్చెయ్యపేట, ఐయితంపూడి, కరక, చినప్పనపాలెం, దిబ్బిడి తదితర గ్రామాల రైతులు రబీ వరి సాగు చేపట్టారు. పెద్దేరు, కోనాం రిజర్వాయర్ల దిగువన ప్రవహిస్తున్న తాచేరు, బొడ్డేరు, పెద్దేరు ఆయకట్టుతోపాటు వ్యవసాయ మోటార్లు, బావులు ఉన్న రైతులు వరి నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో రబీ వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తక్కువ సమయంలో పండే స్వల్ప కాలిక ఎర్రమల్లెలు, జయ, 1010 తదితర రకాలకు చెందిన వరినాట్లు వేస్తున్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటిస్తున్నారు.

14న మండల పరిషత్ సమావేశం

పాయకరావుపేట : ఈ నెల 14వ తేదీన (మంగళవారం) మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. మండల పరిషత్ ఆవరణలో గల స్త్రీశక్తి భవన్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, ఆయా శాఖల మండల అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సాంబశివరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యత్వ నమోదు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని జగ్గన్నపేటలో శనివారం సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు, ఆడారి త్రినాథ్, బుజ్జి, భాస్కర్‌రావు, లక్ష్మి పాల్గొన్నారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు

ఎస్.రాయవరం : పెనుగొల్లు సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. అన్నవరం విశాఖపట్నం వెలుతున్న కారు ఈ ప్రమాదానికి గురైంది. కారు బోల్తా పడిన సమయంలో ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తున్నట్టు ఎస్.రాయవరం పోలీసులు చెప్పారు. పూర్తి వివరాలు రావాల్సి ఉందని, కేసు నమోదు చేశామని చెప్పారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి


ఎమ్మెల్యే రమణమూర్తిరాజును కలిసిన ఉమ్మలాడ దళితవాసులు

మునగపాక : తమకు శారదానది పరివాహక ప్రాంతంలో శ్మశానవాటికకు అవసరమయ్యే స్థలం కేటాయించాలని కోరుతూ ఉమ్మలాడ దళితులు ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు)ను శనివారం కోరారు. తమ కులస్తులకు ఇంతవరకు శారదానది ఒడ్డున పాన్పులు చేసేవారమని,ఈ సమయంలో ఇబ్బందులు పడాల్సివచ్చేదని ఈ నేపథ్యంలో ప్రత్యేకమైన స్థలం కేటాయించాలని కోరారు. దళిత విభాగం మండల అధ్యక్షుడు మందా రాము నేతృత్వంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజును కలిసిన వారిలో కోడి పెద్దిరాజు, పావాడ గంగరాజు, పెంటయ్య, పోతురాజు తదితరులున్నారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు

బుచ్చెయ్యపేట: మంగళాపురం శివారు కుముదాంపేటలో ఆదివారం నేడు జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందెం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ దేవత మోదమాంబ తీర్థం సందర్భంగా ఈ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో తొలి ఆరు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

కక్షిదారుల సౌకర్యార్థం బెంచీల వితరణ


దాతలు ఇచ్చిన బెంచీలను ప్రారంభించిన జడ్జీలు

చోడవరం రూరల్: స్థానిక కోర్టుల సముదాయంలో కక్షిదారుల సౌకర్యార్థం కేసుల సమయంలో సేద తీరడానికి వీలుగా వాకర్స్ క్లబ్ సభ్యులు సిమెంట్ బెంచీలను వితరణగా అందజేశారు. శనివారం కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి సత్తి అరుణశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి ప్రారంభించారు. చోడవరం వాకర్స్ క్లబ్ సభ్యులు ఎస్ఎస్ షాపింగ్ మాల్ అధిపతి పి.ఎస్.కె. గుప్తా, దుర్గావిలాస్ యజమాని తుమ్మల కృష్ణారావుల ఆర్థిక సాయంతో సమకూర్చినట్టు క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు తెలిపారు. చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతల ప్రకాశరావు, న్యాయవాదులు బంటు నళిని, నంబారు నర్సింగరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి అశోక్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మూర్తి

ఎస్.రాయవరం: గ్రామాల్లో పలు సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శాఖల వారీగా అధికారులు ప్రభుత్వ పథకాలు, చేపడుతున్న పనులు వివరించారు. చిన గుమ్ములూరులో గృహ నిర్మాణ శాఖలో అక్రమాలకు పాల్పడి అనర్హులకు నగదు అందజేస్తున్నారని సర్పంచ్ గాడి అప్పలనరసింహ ఆరోపించారు. వాకపాడు గ్రామంలో నిర్మాణం పూర్తయిన పాఠశాల భవనాన్ని విద్యార్థులకు కాంట్రాక్టర్ ఇవ్వడం లేదని సర్పంచ్ మైలపల్లి శ్రీనివాస్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. విద్యాశాఖలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని, ఆ కార్యక్రమాలు సద్వినియోగం అయ్యేలా ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంఈవో మూర్తి కోరారు. వేసవి సమీపిస్తుందని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రామచంద్రమూర్తి ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ శ్రీనివాస్‌కి సూచించారు.

ఎస్.రాయవరం, సర్వసిద్ధి, పేటసూదిపురం, కొరుప్రోలు తదితర గ్రామాల్లో చేతి బోర్లు వేయించాలని ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్యామ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యానారాయణ, సర్పంచ్‌లు దూళి శ్రీనివాస్, శానాపతి శ్రీరాములు, కొప్పిశెట్టి సత్యం, దారబోయిన గణేశ్వరరావు, ఎంపీటీసీలు సూరిబాబు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

16న మునగపాకలో షిర్డీసాయిబాబా విగ్రహ ప్రతిష్ట


మునగపాకలోని షిర్డీసాయిబాబా ఆలయం

మునగపాక : మండల కేంద్రంలో ఈ నెల 16న షిర్డీ సాయిబాబా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఆలయ చైర్మన్ బొడ్డేడ వీరేంద్ర తెలిపారు. మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14న ఉదయం గణపతి పూజ, మధ్యాహ్నం హోమం, సాయంత్రం జలాదివాసం కార్యక్రమం జరుగుతుందన్నారు. 15వ తేదీన ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం పాలాభిషేకం జరుగుతుందన్నారు. 16వ తేదీన ఉదయం సాయిబాబా విగ్రహ ప్రతిష్టతో పాటు మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని వీరేంద్ర కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


జూనియర్ కళాశాల ఆవరణలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కోటవురట్ల : పూర్వ విద్యార్థుల ఆత్మీయ పలకరింపులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం పులకరించింది. 1989లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎక్కడెక్కడో వివిధ వృత్తుల్లో స్థిరపడిన ఆనాటి స్నేహితులంతా మళ్లీ కలుసుకుని మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఆటా పాటలతో కాలక్షేపం చేశారు. విద్యా బుద్ధులు నేర్పి తమ ఉన్నతికి కారణమైన గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. ఆత్మీయ కబుర్లు చెప్పుకుంటూ విందు ఆరగించారు. తమ ఉన్నతికి కారణమైన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందివ్వాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తుమ్మలపల్లి ఆంజనేయులు, జానకి శ్రీను, బత్తుల గోవిందు, సాందీప్‌రాజ్, గెడ్డమూరి సత్యనారాయణ, కొరుప్రోలు గోవిందు, చిటికెల కాశీ, బూకా ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం


రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన వైస్ ఎంపీపీ సీతారామరాజు

కోటవురట్ల : ఆ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించిన వేళ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. నీలిగుంట గ్రామంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన సమస్యను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు చొరవతో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పరిష్కరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు విన్నవించిన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. ఫలితంగా శ్మశాన వాటికలో చేతిబోరు ఏర్పాటు చేశారు. రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేశారు. దాంతో శనివారం కొత్త బోరును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, వైస్ ఎంపీపీ సీతారామరాజు ప్రారంభించారు. రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో పరిష్కారమే అంతిమం

- చోడవరం సీనియర్ సివిల్ జడ్జి సత్తి అరుణశ్రీ


మాట్లాడుతున్న సీనియర్ జడ్జి అరుణశ్రీ


హాజరైన పోలీస్ సిబ్బంది, కక్షిదారులు

చోడవరం రూరల్: లోక్ అదాలత్‌లో ఉభయ పక్షాలు రాజీ పడితే హైకోర్టులో అప్పీలు చేయడానికి అవకాశం ఉండదని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి సత్తి అరుణశ్రీ స్పష్టం చేశారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ ప్రసంగించారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే బదులు ఇరువర్గాలు అంగీకారానికి వచ్చి లోక్ అదాలత్‌లో రాజీపడడం మేలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమే అంతిమమని, దీనికి తిరుగులేదని కక్షిదారులకు పిలుపు నిచ్చారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ఉమాదేవి మాట్లాడుతూ అనవసర పట్టింపులతో కేసులను కొనసాగించుకోవడం ఇరువర్గాల వారికి కాలయాపన, ఖర్చు వృథా అన్నారు. కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ మాట్లాడుతూ అవకాశం ఉన్నంత మేరకు రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతల ప్రకాశరావు మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి తమ బార్ సభ్యులు ఇరు వర్గాలను ఒప్పించడంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్టు తెలిపారు.

లోక్ అదాలత్‌లో 1,404 కేసుల పరిష్కారం..

స్థానిక కోర్టుల సముదాయంలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో భారీగా కేసులు పరిష్కారమయ్యాయి. రాజీపడదగ్గ కేసుల్లో సివిల్, క్రిమినల్, కేలండర్, ఇతర కేసులు 1,620 గుర్తించారు. వీటిలో లోక్ అదాలత్ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ 1,462 కేసులను రిఫర్ చేసారు. 1,404 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. వీటిలో క్రిమినల్ కేసులు అత్యధికంగా 1,320, ప్రీ లిటిగేషన్ కేసులు 67, సివిల్ కేసులు 17 ఉన్నాయి.